క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ పలు అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. పళవల్లి,నీలమ్మనహళ్లి, చిక్కహళ్లిలో సీసీ రోడ్లు, చరండి తదితర నిర్మాణ పనులకు దాదాపు రూ.2.5 కోట్లతో భూమి పూజ చేశారు.

పౌష్టికాహారంతో శారీరక ధృఢత్వం

పరిగి: పౌష్టిహారంతో శారీరక ధృడత్వం ఏర్పడుతుందని మెడికల్ ఆఫీసర్ స్వరూపరెడ్డి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు తప్పకుండా ఆహార నియమాలను పాటించాలన్నారు. అనంతరం దివ్య ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని కల్పించారు. కాగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు.

వినాయక్‌నగర్‌లో పారిశుధ్య పనులు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని వినాయక్‌నగర్‌లో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్మికులు సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. మనీషా అనే చిన్నారి డెంగీ బారిన పడడంతో జ్వరాలు ప్రబలకుండా మురికి కాలువలను శుభ్రం చేయించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రవీంధ్ర, కార్యదర్శి రామాంజినేయులు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.50,500 పలికిన లడ్డూ



లడ్డూను దక్కించుకున్న ఉప్పర వీరన్న

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని షిర్డీనగర్‌లో వినాయకుడి లడ్డూను వేలం వేయగా ఉప్పర వీరన్న రూ.50,500కు దక్కించుకున్నారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు సీసీ హరి, మాజీ సర్పంచ్ డీసీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భవనం కేటాయించండి

హిందూపురం టౌన్: పట్టణంలోని మెయిన్ బజార్‌లోని బసవేశ్వర దేవాలయం పక్కన ఉన్న భవనాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలని వీరశైవ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందించారు. కమ్యూనిటీ కేంద్రంగా, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు వీరభద్రప్ప, కార్యదర్శి ఉమేష్, ట్రెజరర్ సంపత్ కుమార్, బసరాజ్, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది పంచాయతీలోని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకున్నామని సర్పంచ్ గీత తెలిపారు. ఏఆర్ రొప్పం, హెచ్ ఆర్ పాళ్యం, ఆమిదాలగొంది గ్రామాల్లో చెడిపోయిన వాటర్ స్కీమ్ బోర్లు, మోటార్లు, స్టార్టర్లకు మరమ్మతు చేసి బోర్లకు బిగించి నీటిని సరఫరా చేశామన్నారు. అదే విధంగా దెబ్బతిన్న పైపులైన్ కూడా మరమ్మతు చేసి కొళాయిలు, ట్యాంకు నీటిని సరఫరా చేయించామన్నారు.

వరద బాధితులకు విరాళం



చెక్కు అందిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: పట్టణ మెప్మా విభాగానికి చెందిన తెలుగుతల్లి పట్టణ సమాఖ్య, భరత మాత పట్టణ సమాఖ్య సభ్యులు రూ.1.50 లక్షలను విజయవాడ వరద బాధితులకు అందజేశారు. ఇందులో భాగంగానే ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో స్థానిక నాయకుల ద్వారా ప్రభుత్వానికి పంపారు. మహిళా సంఘాల సభ్యులు వరద బాధితులకు అండగా నిలవడం అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, డీఈ రమేష్‌కుమార్, వడ్డే అంజినప్ప తెలిపారు.

యమపాశాలుగా ట్రాన్స్‌ఫార్మర్లు

అసలే వర్షాకాలం.. ఇళ్ల ముందు కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, ఇనుప విద్యుత్ స్తంభాలు.. అప్పుడప్పుడూ మెరుపులు, మంటలు.. ఇళ్లపై నుంచే వేలాడుతున్న విద్యుత్ తీగలు.. ఇలా.. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. దీంతో ప్రజలు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు.

- జనావాసాల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు
- ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు
- వర్షాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో ప్రజలు

ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు	
మండలం	ఫెన్సింగ్ లేనివి
పెనుకొండ	90
పరిగి	72
రొద్దం	130
సోమందేపల్లి	40
గోరంట్ల	110

పరిగి: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజలతో పాటు మూగ జీవుల ప్రాణాల మీదకు తెస్తోంది. పెనుకొండ నియోజకవర్గంలో విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ చాలా ప్రాంతాల్లో రక్షణ గోడలు, కంచెలు లేకపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రోడ్ల పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, చిన్నారులు తిరుగుతూ ఉండే ప్రాంతాల్లో చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లతో ఎప్పుడు ఏరూపంలో ప్రమాదం ముంచుకొస్తుందో తెలీడం లేదని వాపోతున్నారు.



పెద్దిరెడ్డిపల్లిలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు (ఫైల్)



శ్రీరంగరాజుపల్లి వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు

ఆవుల మృత్యువాత

నియోజకవర్గంలోని పరిగి, రొద్దం మండలాల్లో ఇటీవల జరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదాల్లో రెండు ఆవులు చనిపోయాయి. పెద్దిరెడ్డిపల్లిలో జూలై 13న శ్రీరామప్ప అనే రైతు తన పాడి ఆవుకు ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వైరుకు తగిలి చనిపోయింది. అలాగే రొద్దం మండలంలోని చెరుకూరులో ఆగస్టు 19న రైతు హనుమంతరాయప్పకు చెందిన ఆవు కంచెలేని ఓ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జరిగిన ప్రమాదంలో గ్రౌండ్ ఎర్త్ జరిగి చనిపోయింది. ఇలాంటి సంఘటనలతో పశువులకే కాకుండా ప్రజలకు ప్రాణహాని పొంచి ఉందన్న విషయాలను గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయడంతో పాటు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

పాడి ఆవు చనిపోయింది



నాకున్న ఐదు ఆవులతో కుటుంబ పోషణ చేసుకుంటున్నాను. మా గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన వైర్లకు తగిలి నా పాడి ఆవు చనిపోయింది. దీనికి విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణం. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం ఖరీదుతో దాదాపు రూ.80 వేల విలువైన ఆవును కోల్పోయాను. ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నాను.

– శ్రీరామప్ప, బాధిత రైతు, పెద్దిరెడ్డిపల్లి

రక్షణ చర్యలు చేపట్టాలి



మండలంలోనే కాకుండా నియోజకవర్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ గోడలను నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలి. ప్రమాదాలు జరిగిన తరువాత హడావుడి చేయడం కంటే ముందస్తుగా తగిన భద్రతా చర్యలను చేపట్టాలి. పరిగి మండలంలో చాలా ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ గోడలు, ఫెన్సింగ్ ఏర్పాటు వంటి చర్యలు లేవు. ఇకనైనా విద్యుత్‌శాఖ అధికారులు మేల్కొనకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

– నరసింహారెడ్డి, పరిగి

చర్యలు చేపడతాం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫెన్సింగ్‌ల ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే హిందూపురం డివిజన్ పరిధిలో ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించాం. వీటి సమాచారాన్ని ఉన్నతాధికారులకు పంపించాం. నివేదికల ఆధారంగా వచ్చే నిధులతో గ్రామాలలో ఫెన్సింగ్‌లను నిర్మించడానికి కృషి చేస్తాం.

– రంగయ్య, ట్రాన్స్‌కో ఏడీ, హిందూపురం

వరద కష్టాలకు చంద్రబాబే కారణం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప





మడకశిర: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే విజయవాడలో వరదలు వచ్చి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. వరద బాధితులను ఆదుకోవడంలో కూడా చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. భారీ వర్షాలు, వరదలు వచ్చే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలను అప్రమత్తం చేయడం, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారికి కావాల్సిన కనీస వసతులు, ఆహారం, నీరు అందించడం తదితర వాటిని నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు. కనీసం వరదలకు గురయ్యే ప్రాంతాల్లోని ప్రజల ఇళ్లను ఖాళీ చేయించే ప్రయత్నం కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు చేయలేదన్నారు. కేవలం చంద్రబాబు ఇల్లు మునిగిపోకుండా, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదిలేశారన్నారు. దానివల్లే ఘోరమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ వైఫల్యంతో 50 మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. బోట్లు, పడవల ద్వారా బాధితులను సురక్షిత ప్రాంతాలకు చేరవేసే ప్రయత్నాన్ని కూడా ప్రభుత్వం చేయకపోవడం దుర్మార్గమన్నారు. వర్షం, వరద తగ్గుముఖం పట్టిన తర్వాత కూడా ప్రభుత్వం కనీస వసతులను బాధితులకు కల్పించలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యంతో ఎనిమిది రోజుల పాటు లక్షల మంది ప్రజలు నరకయాతన అనుభవించారని చెప్పారు. ముఖ్యమంత్రి అధికారులను వెంట వేసుకుని తిరగటం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. రోజుకు మూడు నాలుగు సార్లు ప్రెస్‌మీట్‌లు పెట్టి అంతా తానే చేస్తున్నట్లు చెప్పుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్లక్ష్యంతోనే విజయవాడ వరదల్లో మునిగిపోయిందన్నారు. చంద్రబాబు వరద బాధితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని అప్పేపల్లిలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని సోమవారం వైభవంగా కొల్హాపురి మహాలక్ష్మీదేవికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా పట్టం కూర్చోబెట్టిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్దకు తీసుకెళ్లి సమర్పించారు.



కొల్హాపురి మహాలక్ష్మీదేవి

జై బోలో గణేశ్ మహారాజ్‌కీ జై ..

సాక్షిబృందం: వినాయక నిమజ్జనం సందర్భంగా వివిధ ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. మూడు రోజులుగా ఆయా చోట్ల ఏర్పాటు చేసిన మంటపాల్లో బొజ్జ గణపయ్యకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సోమవారం మూడోరోజు కావడంతో గణనాథులను నిమజ్జనానికి తరలించారు. ముందుగా వినాయక విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో కొలువుదీర్చి యువకులు డప్పు శద్ధాలకు అనుగుణంగా డ్యాన్స్ చేస్తూ, రంగులు చల్లుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. జై బోలో..గణేష్ మహరాజ్‌కీ..జై అంటూ నినాదాలు చేస్తు సమీపంలో ఉన్న చెరువులు, కుంట వద్దకు తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.



మడకశిర మండలం మణూరులో గణనాథున్ని నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



సోమందేపల్లిలో వినాయకుడిని చెరువులో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



గోరంట్ల: గణేష్ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



అమరాపురం: నిమజ్జనానికి వినాయకుడి ప్రతిమను తరలిస్తున్న భక్తులు



పరిగి మండలం శ్రీరంగరాజుపల్లిలో నిమజ్జనోత్సవానికి తరలుతున్న లంబోదరుడు



పెనుకొండలో నిమజ్జన సందడి



అగళి మండలం ఆలూడిలో నిమజ్జన సందడి



రొళ్ల మండలం ఆవినకుంటలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న కమిటీ సభ్యులు



లేపాక్షి మండలం శిరివరంలో సందడిగా సాగుతున్న ఊరేగింపు




రొద్దం మండలం పెద్దిపల్లిలో బొజ్జ గణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న గ్రామస్తులు



పావగడ: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



లేపాక్షి బసవన వీధిలో కొలువైన గణనాథుడు



అమరాపురంలో కొలువుదీరిన పార్వతీతనయుడు

భూముల విక్రయాలను రద్దు చేయండి

పరిగి: మండల కేంద్రంలో కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మంజూరు చేసిన భూమిని కొందరు విక్రయించి, తమకు అన్యాయం చేశారని పరిగి కల్లుగీత కార్మికుడు ఈడిగ ఆంజనేయులు, దళిత సంఘాలు కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం పుట్టపర్తిలో కలెక్టర్‌ను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ 2003 సంవత్సరంలో గీత కార్మికుల సంక్షేమానికి 7.66 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చిందన్నారు. నాటి నుంచి తన పేరు మీద ఉన్న భూమిని కొందరు కబ్జా చేయడమే కాకుండా అమ్మేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి, కల్లుగీత కార్మికుల సొసైటీ భూముల విక్రయాలను రద్దుచేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో న్యాయవాది రవికుమార్ ఉన్నారు.

జూదరుల అరెస్టు

రొళ్ల: మండల పరిధిలోని హెచ్‌టీ హళ్లి గ్రామంలో జూద కేంద్రంపై దాడి చేసినట్లు సోమవారం సాయంత్రం ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.6,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు కూడా నమోదు చేశామని, త్వరలోనే జూదరులను మడకశిర కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

మరణించినా బీమా ప్రీమియం కట్

- ఎస్‌బీఐ సిబ్బంది నిర్వాకంతో బాధితులకు అందని పరిహారం

చిలమత్తూరు: మనిషి మరణించిన ఏడాది తర్వాత కూడా బీమా సొమ్ము బ్యాంక్ ఖాతా నుంచి బదిలీ కావడం సంచలనంగా మారింది. బాధితుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన బి.గోవిందప్ప భార్య గంగరత్నమ్మ ఏడాది క్రితం మరణించింది. ఆమెకు ఎస్‌బీఐ చిలమత్తూరుశాఖలో పీఎంఎస్‌బీవై నుంచి రూ.20, పీఎంజేజేబీవైకి రూ.436 ఆమె ఖాతా నుంచి బదిలీ అయింది. నామినీగా ఉన్న ఆమె కుమారుడు బ్యాంక్‌కు వెళ్లి బీమా సొమ్ము క్లెయిమ్‌కు అడిగితే ఆధార్ ప్రకారం గంగరత్నమ్మ వయస్సు ఎక్కువ ఉందని, 50 ఏళ్లలోపు మరణిస్తేనే క్లెయిమ్ చేస్తామని బదులిచ్చారు. రేషన్‌కార్డుతోనే బ్యాంకు ఖాతా తెరిచామని, ఈ ఏడాది మార్చిలో కూడా తమ అమ్మ ఖాతా నుంచి బీమా కోసం డబ్బులు కట్ అయ్యాయని గంగరత్నమ్మ కుమారుడు నారాయణమూర్తి తెలిపారు. ఒకవేళ అమ్మ వయస్సు ఎక్కువ ఉన్నట్లైతే డబ్బులు ఎందుకు కట్ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. బ్యాంక్ మేనేజర్‌ను 'సాక్షి' వివరణ కోరగా గంగరత్నమ్మకు ఆధార్, బ్యాంకు ఖాతాలో ఉన్న జనన వివరాలు సరిపోతేనే ఇన్సూరెన్స్ సొమ్ము ఇవ్వడానికి వీలవుతుందన్నారు. గంగరత్నమ్మ చనిపోయిన విషయం తమకు తెలపలేదన్నారు. ఇదిలా ఉంటే 50 ఏళ్లలోపు ఉన్న వారికే బీమా అందిస్తామని చెబుతున్న బ్యాంకు అధికారులు 51 ఏళ్లయినా బీమా కోసం సొమ్మును ఎందుకు కట్ చేశారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తమను మోసం చేసిన బ్యాంక్‌పై కోర్టుకెళతామని బాధితులు తెలిపారు.

బాల్య వివాహానికి చెక్

అగళి: మండల పరిధిలోని పీ బ్యాడగేర గ్రామంలో ఈ నెల 14 బాల్య వివాహం జరుగుతుందని ఫిర్యాదు వెళ్లడంతో ఐసీడీఎస్, పోలీసు సిబ్బంది సోమవారం ఈ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. బాల్యవివాహం చేయడం చట్ట విరుద్ధమన్ని, బాల్యవివాహం చేస్తే కలిగే అనర్థాలను వారి కుటుంబ సభ్యులకు వివరించారు. కుటుంబ సభ్యులు వివాహం చేయమని అధికారులకు హామీ ఇచ్చారు.

సీడీపీఓగా శాంతలక్ష్మికి అదనపు బాధ్యతలు



గుడిబండ: పెనుకొండ ప్రాజెక్ట్ సీడీపీఓగా పని చేస్తున్న జి.శాంతలక్ష్మి గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీజీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. సూపర్‌వైజర్ కమలమ్మ, గుడిబండ అంగనవాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ సెక్రటరీ మహదేవమ్మ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

టీచర్ బదిలీ రద్దు చేయాలి

పరిగి:పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పి, గురుకుల విద్యా సంస్థల్లో పదికి పైగా సీట్లు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మీ బదిలీని వెంటనే రద్దు చేయాలని విద్యార్థులతో పాటూ తల్లిదండ్రులు ఎంఈఓ లక్ష్మీదేవికి వినతిపత్రాన్ని అందించారు. మండలంలోని పెద్దిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేసిన భాగ్యలక్ష్మీ ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా శ్రీరంగరాజుపల్లికి వెళ్లారు. దీన్ని జీర్ణించుకోలేని పెద్దిరెడ్డిపల్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గత వారంలో పాఠశాలలో తరగతి గదులకు తాళాలు వేసి, బాయ్‌కాట్ చేసి నిరసన తెలిపారు. సోమవారం కూడా విద్యార్థులు, తల్లిదండ్రులు పరిగి ఎమ్మార్సీకి తరలివచ్చారు. మూకుమ్మడిగా కార్యాలయంలో భైఠాయించి తమ ఆవేదనను ఎంఈఓ లక్ష్మీదేవిని కలిసి వినతి పత్రాన్ని అందించారు.